డిటెక్టివ్ స్టోరీ

# ఆత్మ(హ)త్య

హోతా పద్మినీదేవి

**నేల మీద గది మధ్యగా వుంది సునీత శవం. నోట్లోంచి ఎండ్రిన్ కారుతోంది. పక్కనే సగం ఖాళీ అయిన ఎండ్రిన్ డబ్బావుంది. సునీత ఆత్మహత్య విషయం తెలిసి అక్కడకొచ్చిన ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర ఆమె మృతదేహాన్ని చూసి నివ్వెరపోయాడు. శవంలో కూడా అంత అందాన్ని మొదటిసారిగా చూస్తున్నాడతను.**

**నేల మీద గది మధ్యగా వుంది సునీత శవం. పక్కనే సగం ఖాళీ అయిన ఎండ్రిన్ డబ్బా వుంది. నోట్లోంచి కారిన ఎండ్రిన్ ఆమె ఒంటి మీదున్న చీర, రవికెలని కూడా తడిపి గుప్పున ఘాటైన వాసన వేస్తోంది.**

**పోలీసు జీపు ఆ ఇంటిముందు ఆగేసరికి ఇంటి అరుగుమీద మూర్తీభవించిన విషాదంలా వున్న మురళి ఆత్రంగా జీపు దగ్గరకొచ్చాడు.**

**జీపు దిగిన ఇన్‌స్పెక్టర్ రవిచంద్రకి నమస్కరించి అన్నాడు.**

**ఇన్‌స్పెక్టర్ గారూ! సునీత ఆత్మహత్య చేసుకునేంత భీరువు కాదు. ఆమె మరణం వెనుక ఏదో మిస్టరీ వుంది. దాన్ని మీరు పరిశోధించి న్యాయం చెయ్యండి సార్ ప్లీజ్!'**

''మీరు?'' రవిచంద్ర అతన్ని ప్రశ్నార్థకంగా చూసాడు.

''నా పేరు మురళి. విప్రోలో ఇంజనీరింగ్ పని చేస్తున్నాను. సునీత నేను పెళ్ళి చేసు కుందామనుకుంటుండగా ఆమె మరణించడం..'' అతని గొంతు దుఃఖంతో పూడుకు పోయింది.

కామేశ్వర్రావు పరిస్థితి అంతకంటే మెరుగ్గా ఏమీ లేదు. కొడుకుపోయిన దుఃఖం నుంచి తేరుకోక ముందే కోడలు మరణించడం అతను తట్టుకోలేక పోతున్నాడు.

శవాన్ని పోస్ట్‌మార్టమ్‌కి తరలించాక ''మీరు స్టేషన్‌కి రండి అన్నాడు మురళితో. తనకు, సునీతకు మధ్య ఉన్న పరిచయం గురించి మురళి చెప్పడం మొదలుపెట్టాడు.

***

''సునీతా! నీ కోసం ఎవరో వచ్చారు చూడు'' మామగారి పిలుపుతో బయటకొచ్చింది సునీత. ఎదుటి వ్యక్తిని చూసి ఆమె కళ్ళు సంభ్రమంతో విచ్చుకున్నాయి.

''మురళీ...'' ఆమె పెదవులు అస్పష్టంగా ఉచ్చరించాయి. ''సెలవులకని మన ఊరికి వచ్చాను. నీ జీవితంలోని ట్రాజెడీ గురించి అమ్మ చెప్పింది.''

సునీత కళ్ళలో నీళ్ళూరాయి.

''ఐయామ్ సారీ! నిన్నిలా చూడవలసి వస్తుందనుకోలేదు.'' మురళీ స్వరంలో విచారం. మంచుదెబ్బ తిన్న మల్లెపువ్వులా, రంగువెలసిన బొమ్మలా వున్న ఆమెని విహ్వలంగా చూస్తున్నాడతను.

సునీత చెక్కిళ్ళు అశ్రుధారలతో తడిసిపోతున్నాయి.

''విధి నిర్ణయం అలా వుంది. పాతికేళ్ళకే వాడికి నూరేళ్ళు నిండిపోయాయి. ఏం చేస్తాం?'' అన్నాడు కామేశ్వర్రావు సునీత మామగారు.

కొన్ని క్షణాలకి ఆమె తెప్పరిల్లింది.

కూర్చో మురళీ! మంచినీళ్ళు తెస్తాను. అంది లోపలికి వెళ్తూ. అతను కూర్చున్నాడు.

సునీత మంచినీళ్ళు తెచ్చి లోపలకివెళ్ళి, ముఖం కడుక్కుని వచ్చింది. వస్తూ కాఫీ తెచ్చింది. ఆమె బయటకొచ్చేసరికి మురళి కామేశ్వర్రావుతో చెబుతున్నాడు. ''సునీత చాలా బ్రిలియంట్ అండీ!' ఎప్పుడూ క్లాసు ఫస్టున వుండేది. తను ఇంజనీరింగ్ చదువు తాననంటుండేది. కాని, ఇంటర్మీడియెట్ తర్వాత చదువు ఆపేసింది. కారణం తెలియదు. నేను ఇంజనీరింగ్‌లో చేరాను. పోయినసారి సెలవులకొచ్చినప్పుడు ఆమెకి పెళ్ళయిందని మా అమ్మ చెప్పింది. ఇంతలో ఇలా జరగడం...'' కాఫీ కప్పులతో వచ్చిన సునీతని చూసి మధ్యలోనే మాటలని మింగేసాడు.

సునీత మామగారితో చెప్పింది. ''మురళి ఇంటర్లో నా క్లాస్‌మేట్ మామయ్యా! వెనుక బెంచీలో చేరి ఎప్పుడూ అల్లరి చేస్తూ వుండేవాడు. కాని, చదువులో మాత్రం, ఎప్పుడూ ఫస్టే.'' ఆమె పెదవులు నవ్వుతున్నా స్వరంలో దుఃఖచ్ఛాయలింకా మాసి పోలేదు.

''కాదు. నువ్వు ఫస్ట్ నేను సెకండ్'' అన్నాడు మురళి తను ఆమె తర్వాతే అని హుందాగా అంగీకరిస్తూ.

కామేశ్వర్రావు చిరునవ్వుతో వింటున్నాడు. ''నువ్వు చదువు కంటిన్యూ చెయ్యవచ్చుగా సునీతా'' వున్నట్టుండి అడిగేడతను.

''నేనా'' తెల్లబోయింది.

''ఏం? తప్పా? ఈ పరిస్థితులలో నీకంటూ ఒక వ్యాపకం అవసరం.

''ప్రైవేటుగా చదవగలనా? సైన్సు అర్థమవుతుందా? ప్రాక్టికల్సు ఎలా?''

కాలేజీలో చేరు.

ఆమె తత్తరపడి మామగారి వైపు చూసింది.

''నిజమేనమ్మా! కాలేజీలో చేరు. ఎంతసేపని ఇంట్లో కూర్చుంటావు?'' అన్నాడు కామేశ్వర్రావు.

సునీత ఆయన నుంచి వ్యతిరేకత ఎదురు కాకపోవడంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

ఆమె మనసు ఆనంద విషాదాల సమ్మేళనంగా వుంది. భర్త చనిపోయిన దుఃఖం ఒక వైపు చదువుకోవాలనే తనకల ఇప్పటికైనా తీరబోతోందనే ఆనందం మరోవైపు. ఇంజనీరింగ్ చదవాలని ఎన్ని కలలు కంది? కాని సవతితల్లి తన చదువు మానిపించింది. వ్యక్తిత్వాన్ని ఆవిడకి తాకట్టుపెట్టిన తన తండ్రి ఆవిడ తీర్మానానికి తల ఊపాడు. తనా ఇంటి పని మనిషి అయింది. రెండేళ్ళ తర్వాత మేనమామ తనకో పెళ్ళి సంబంధం తెచ్చాడు. కట్నకానుకలు అక్కర్లేదనడంతో నేమో, సవతి తల్లి ఆ సంబంధానికి ఒప్పు

కుంది. తన భర్త మంచివాడు. మామగారు తండ్రి ప్రేమని పంచాడు. పొలంలో పాముకాటుకి గురయి భర్త చనిపోవడంతో వైవాహిక జీవితం మూడు నాళ్ళ ముచ్చట అయింది. తన దుఃఖాన్ని దిగమింగుకుని ఒక్కగానొక్క కొడుకుని పోగొట్టుకుని కుమిలిపోతున్న మామగారిని ఓదార్చింది. పుట్టెడు కష్టంలో వున్నా పుట్టింటి ఆదరణ కరువైన తనకి అత్తిల్లే పుట్టిల్లు అయింది.

మురళి తనని వెతుక్కుంటూ రావడం, చదువు కంటిన్యూ చెయ్యమని ప్రోత్సహించడం, మామగారు దానికి ఆమోద ముద్రవెయ్యడంతో తాత్కాలికంగా తన దుఃఖాన్ని మరచి పోయింది సునీత.

***

'సునీతా! నీకు ఫోన్!' బిగ్గరగా పిలిచి చెప్పాడు. కామేశ్వర్రావు.

"ఎవరు మామయ్యా?"

"మురళి."

ఆమె ఒక్కంగలో వచ్చి ఫోన్ అందుకుంది. అయిదు నిముషాల సంభాషించాక ఫోన్‌పెట్టి చెప్పింది.

మురళికి విప్రోలో జాబ్ వచ్చిందిట మామయ్యా!

"అలాగా! చాలా సంతోషం. ఇంకేమిటి సంగతులు?"

"నన్ను బాగా చదువుకోమన్నాడు."

"ఆ అబ్బాయికి నువ్వంటే చాలా అభిమానం."

"అవును మామయ్యా!" అంది. ఆమె కళ్ళు వెలిగి పోతున్నాయి.

***

"నేను సునీతని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను." మురళి చెప్పగానే, కామేశ్వర్రావు ఆశ్చర్యంగా చూసాడు. కొన్ని క్షణాల మౌనం తర్వాత అడిగేడు.

"మీ వాళ్ళకి ఇష్టమేనా? వాళ్ళతో మాట్లాడేవా?"

"ఇంకా లేదు. ముందు మీ అనుమతి తీసుకున్నాక మాట్లాడుదామని..."

"బహుశా పునర్వివాహానికి సునీత అంగీకరించకపోవచ్చు"

"ఆమె కిష్టమే. ఆమెతో మాట్లాడాకనే" మీ దగ్గర ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నాను..."

కామేశ్వర్రావు. కొన్ని క్షణాల మౌనం తర్వాత అన్నాడు.

"సునీతకి నువ్వంటే ఇష్టమేనని నాకు తెలుసు. కాని, ఆ ఇష్టం నిన్ను పెళ్ళి చేసుకునేంత గాఢమైనదని ఇప్పుడే తెలిసింది. మోడువారిన ఆమె జీవితంలో నువ్వు వసంతాన్ని తెస్తానంటే అంతకంటే సంతోషించదగ్గ విషయం ఏముంది?"

తమ పెళ్ళికి అభ్యంతర పెడతాడనుకున్న ఆయన అంగీకరించడంతో మురళి ముఖం ఆనందంతో విప్పారింది.

"థాంక్స్ బాబాయ్ గారూ!"

"కాని, మీ వాళ్ళ అంగీకారం కూడా ముఖ్యం. ఎందుకంటే పెళ్ళంటే ఇద్దరు వ్యక్తులకి సంబంధించినది మాత్రమే కాదు. రెండు కుటుంబాలకి సంబంధించినది కూడా."

వారం రోజుల తర్వాత మళ్ళీ ఆ ఇంటికి వచ్చాడు మురళి. అతని ముఖం గంభీరంగా వుంది. "నిన్ను పెళ్ళి చేసుకోడానికి మా వాళ్ళు ఒప్పుకోవడం లేదు సునీతా!" అతను చెప్పగానే సునీత ముఖం పాలిపోయింది.

"కాని, నీకోసం వాళ్ళనందరినీ వదులుకోడానికి సిద్ధంగా వున్నాను. నాకు మంచి ఉద్యోగం వుంది. నిన్ను మహారాణిలా చూసుకుంటాను.".

సునీత ముఖం మరింత పాలిపోయింది. "తన కోసం అతని కుటుంబాన్ని, వదులుకోడం ఎంత వరకు సమంజసం" ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడతను.


"మనం రిజిస్టర్ మేరేజి చేసుకుందాం. మనతో బాటు మీ మామగారిని కూడా తీసుకెళ్దాం. ఆయన మనతోనే వుంటారు.."

సునీత కళ్ళలో నీళ్ళూరాయి. అవి ఆనందభాష్పాలో, దుఃఖాశ్రువులో ఆమెకే తెలియదు.

***

డాక్టర్ కృష్ణంరాజు సునీత శవాన్ని పరిశీలనగా చూస్తున్నాడు. నోట్లోంచి ఎండ్రిన్ కారుతోంది. కాని ఎండ్రిన్ తాగడం వలన సంభవించిన మరణమైతే రక్తంతో కలిసిన చొంగ కూడా వుండాలి. కాని, ఈ కేసులో అలాంటిదేమీ కానరావడం లేదు. ఎండ్రిన్ త్రాగి మరణించిన కేసులలో కళ్ళలో ఎర్రజీరలు ఏర్పడతాయి. కంటి పాపలు బాగా పెద్దవవుతాయి. చేతి గోళ్ళు, కాలిగోళ్ళు నీలిరంగులోకి మారతాయి. ఇటువంటి లక్షణాలేవీ సునీత శవంలో కనబడడం లేదు.

జాగ్రత్తగా ఛాతీకేసి చూసాడు. శ్వాసకోసాన్ని శ్వాసవెళ్ళే గొట్టాలని పరిశీలించాడు. పాయిజనింగ్ కేసులలో శ్వాసకోశాలు ఉబ్బి వుంటాయి. వాటిలో కొంత నీరు చేరి వుంటుంది. శ్వాసకోశాలకి గాలి తీసుకెళ్ళే గొట్టాల లోపల పొరలలో ఎర్రని వాపు వుంటుంది. వాటిల్లో రక్తంతో కూడిన జిగురు పదార్థం వుంటుంది. కాని మృతదేహపు శ్వాసకోశాలలో ఈ లక్షణాలేవీ కనబడ్డంలేదు. కడుపు కోసి చూసాడు. ఎండ్రిన్ తాగినప్పుడు మండిపోయి అన్నవాహిక ఎర్రగా అయిపోతుంది. జీర్ణకోశం, పేగులు లోపలి పొరలు ఉబ్బుతాయి. జీర్ణకోశం లోపలి పదార్థాలు ఎండ్రిన్‌తో కలిసిపోయి కిరోసిన్ వాసన కలిగిస్తాయి. డాక్టర్ కృష్ణంరాజుకి అలాంటి లక్షణాలేవీ కనబడక పోయినా కెమికల్ ఎనాలసిస్ కోసం జీర్ణాశయాన్ని అందులో భాగాలని తీసి సీసాలో భద్రపరిచాడు.




లివర్ ఎర్రబడడమే కాదు, కాస్త చిటికి వుంది. లివర్ నుండి కొంత రక్తం కారి కడుపులో చేరి ఉంది. ఎండ్రిన్ తాగినప్పుడు లివర్, మూత్ర పిండాలు మెదడు ఎర్రబడ్డం, కాస్త ఉబ్బడం మామూలే. కాని, లివర్ చిటికి వుండడం, డాక్టర్ కృష్ణంరాజుకి ఆశ్చర్యం కలిగించింది. కెమికల్ ఎనాలసిస్ కోసం తీసిన జీర్ణాశయాన్ని లేబొరేటరీలో పరీక్ష చెయ్యగా, అందులో ఎండ్రిన్ కాని, మరే విష పదార్థం కాని కనబడలేదు. సో, సునీతది ఆత్మహత్య కాదు. ఎవరో పొట్టలో బలంగా తన్నడం వల్ల లివర్ పగిలి ఆ షాక్‌లో మరణించింది. హంతకుడు ఆమెది ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ఆమె నోట్లో ఎండ్రిన్ పోసాడు. సునీతది హత్య అని ధ్రువపడగానే కృష్ణంరాజు హంతకుడుకి సంబంధించిన ఏ ఆధారమైనా దొరుకుతుందేమోనని ఆమె మృతదేహాన్ని నిశితంగా పరిశీలించాడు.

ఆమె గోళ్ళ సందున మూడు నాలుగు అంగుళాలు పొడవున్న వెంట్రుకలు కనిపించాయి. వాటినిబట్టి అవి మగవాడి వెంట్రుకలని తేలిపోయింది. వాటి మొదళ్ళు తెల్లగా, మిగతా భాగం మరీ నల్లగా వుండడాన్ని బట్టి హంతకుడు హెయిర్ డై వేసుకుంటాడని అర్థమయింది. ఆ వెంట్రుకలని భద్రపరిచి డాక్టర్ పోస్ట్‌మార్టమ్ నివేదిక వ్రాయడానికి పెన్ అందుకున్నాడు.

***

"సునీత ఆత్మహత్య చేసుకోలేదు. ఆమెది హత్య!" రవిచంద్ర చెప్పగానే కామేశ్వర్రావు ముఖంలో రంగులు మారాయి.

"ఆమెని హత్య చేసేంత పగ ఎవరికి వుంది?" అతని స్వరం వణికింది.



"ఎవరికో ఏమిటి? మీకే వుంది". మొదళ్ళు తెల్లగా మిగతా భాగం నల్లగా వున్న అతని జుట్టుని చూస్తూ అన్నాడు ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర.

"నాకా?" కీచుమంది అతని స్వరం.

'అవును మీకే! సునీత మురళిని పెళ్ళి చేసుకుంటాననడం మీకు నచ్చలేదు. ఆ కారణంగా ఆమెతో గొడవ పడేవారు. ఆ విషయం సునీత మురళికి చెప్పింది.''

కామేశ్వర్రావు ముఖం పాలిపోయింది. "నాకేం తెలియదు" అన్నాడు. అతని స్వరంలో నిజాయితీ లేదు. భీతి వుంది.

"ముందు స్టేషన్‌కి నడవండిమీరు" రవిచంద్ర ఆదేశంతో కానిస్టేబుల్స్ అతన్ని జీపెక్కించారు.

ఫోరెన్సిక్ నిపుణుల పరిశోధనలో సునీత వేలి గోళ్ళ సందున వున్న తలవెంట్రుకలు, కామేశ్వర్రావువే అని తేలింది. ఎండ్రిన్ డబ్బా మీద వున్న వేలిముద్రలు అతనివే అని నిర్ధారణ అయింది.

ఇంటరాగేషన్‌లో బయటపడ్డ నిజాలు అందరినీ నివ్వెరపరిచాయి.

"పుట్టింటి ఆదరణకి నోచుకోని సునీత, మా అబ్బాయి చనిపోయాక కూడా నా ఇంట్లోనే వుండవలసి వచ్చింది. ఆమెపై మొదట్లో నాకున్న పితృప్రేమ క్రమేణా కామంగా మారింది. అది తప్పని నాకు తెలుసు. కాని, కామంతో నా కళ్ళు మూసుకుపోయాయి. నా ప్రవర్తనలోని మార్పు ఆమె గమనించకుండా జాగ్రత్తపడ్డాను. ఈలోగా మురళి ఆమెని పెళ్ళి చేసుకుంటానని అడిగాడు. సునీత కూడా అతన్ని కోరుకుంది. వాళ్ళ పెళ్ళికి సమ్మతించినట్టు నటించిన నేను మురళి పరోక్షంలో ఆమె పెళ్ళికి అభ్యంతరాలనేకం చెప్పాను. ఒక రాత్రి ఆమెపై వాంఛని వ్యక్తం చేసాను. ఆమె నిర్ఘాంతపోయింది. తండ్రిలాంటి నేను అలాంటి కోరిక కోరడం సబబు కాదంది. తను మురళి పెళ్ళి చేసుకుని నన్ను వాళ్ళ దగ్గరకి తీసుకెళ్తామని, నా శేషజీవితం వాళ్ళ దగ్గర నిశ్చింతగా గడప వచ్చని చెప్పింది. నాలోని మృగం నిద్ర లేచింది. నేను ఆమెని బలాత్కరించబోయాను. ఆమె ప్రతిఘటించింది. నేను కోపం పట్టలేక ఆమె కడుపులో బలంగా తన్నాను. ఆమె స్పృహ కోల్పోయాక ఆమెని అనుభవించాలనుకున్నాను. కాని ఏమయిందో తెలియదు ఆమె చనిపోయింది. నాకు భయం వేసింది. భయంలోనే ఒక ఉపాయం తట్టింది. ఉద్దేశపూర్వకంగా కాకపోయినా ఆమె మరణానికి కారకుడినైన నేను అది ఆత్మహత్యగా చిత్రీకరించాను..'' తలదించుకున్నాడు కామేశ్వర్రావు.

*

చిరునామా:
హోతా పద్మినీదేవి
పోస్టు బాక్సు నెం.46
రాజమండ్రి -531 101
తూర్పుగోదావరిజిల్లా
ఫోన్: 2426071